క్లుప్తంగా

సహకార సంఘం ఏర్పాటు చేయాలని వినతి



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ధర్మపురి: మండలంలోని నేరెళ్లలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఏర్పాటు చేయాలని బుధవారం జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. నేరెల్ల, గోవిందుపల్లె రైతుల సౌకర్యార్థం సహకార సంఘం ఏర్పాటు కోసం ప్రభుత్వం చొరవ చూపాలని కోరారు. 1968 నుండి 2004 వరకు నేరెళ్లలో సహకారం సంఘం ఉండేదని, 2004 ధర్మపురిలో విలీనం చేశారని తెలిపారు. కార్యక్రమంలో సహకార సంఘం ఉపాధ్యక్షుడు శేర్ల రాజేశం, మాజీ ఎంపీటీసీ రెడ్డవేని సత్యం, నాయకులు బాలాగౌడ్, జంగిలి తిరుపతి, సుధాకర్ పాల్గొన్నారు.

దుకాణాల్లో పోలీసుల తనిఖీ



దుకాణాల్లో తనిఖీ చేస్తున్న ఎస్సై శ్రీకాంత్

కోరుట్ల రూరల్: పట్టణంలోని కిరాణం దుకాణాలు, జనరల్ స్టోర్లలో పోలీసులు బుధవారం తనిఖీ నిర్వహించారు. షాపుల్లో నిషేధిత మాంజా దారం విక్రయిస్తున్నారనే సమాచారంతో ఉన్నతాధికారుల ఆదేశాలతో తనిఖీలు నిర్వహించామని ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. పలు దుకాణాల్లో మాంజా దారం స్వాధీనం చేసుకుని మాంజా దారం విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

తెలుగు పద్యాలతో నైతిక విలువలు పెంపు



పద్యపఠనం చేస్తున్న విద్యార్థులు

రాయికల్: తెలుగు పద్యాలు నైతిక విలువలు పెంపొందిస్తాయని స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం కాపు శ్రీనివాస్ అన్నారు. బుధవారం రాయికల్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మహాభారత పద్య సుమార్చన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పురాణాలు, ఇతిహాసాలు విద్యార్థులకు ఎంతో దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో సీఎం.శర్మ, రాజేశం, రాజశేఖర్, ప్రశాంత్, రమేశ్, పద్మ, తరంగిణి తదితరులు పాల్గొన్నారు.

బైక్ నడిపేటప్పుడు హెల్మెట్ ధరించాలి



అవగాహన కల్పిస్తున్న పోలీసులు

కోరుట్ల రూరల్: బైక్ నడిపేటపుడు తప్పకుండా హెల్మెట్ ధరించాలని మెట్‌పల్లి సీఐ నిరంజన్ రెడ్డి అన్నారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా బుధవారం రోడ్డు సేఫ్టీపై అవగాహన కల్పిస్తూ పట్టణంలోని నంది చౌరస్తా నుంచి కొత్త బస్టాండ్ వరకు కోరుట్ల పోలీస్ ఆధ్వర్యంలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల్లో 50 శాతం మరణాలు హెల్మెట్ ధరించక పోవటం వల్లే జరుగుతున్నాయని , ప్రమాదం జరిగినా హెల్మెట్ ధరించి ఉంటే ప్రాణాపాయం ఉండదన్నారు. తమ పేరెంట్స్ బైక్ కొన్నపుడు తప్పకుండా హెల్మెట్ కూడా కొనుక్కోవాలని పిల్లలు సూచించాలని సీఐ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్సైలు శ్రీకాంత్, రాంచంద్రం గౌడ్, ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

వంద శాతం ఇంటి పన్ను వసూలు చేయాలి

సారంగాపూర్: గ్రామపంచాయతీల్లో జనవరి 31 లోపు ఇంటిపన్నులు వంద శాతం వసూలు చేయాలని ఎంపీడీవో చౌడారపు గంగాధర్ అన్నారు. పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బందితో బుధవారం సమావేశం నిర్వహించారు. ఉదయం 10 గంటల లోపు గ్రామాల్లో ఇంటింటికి చెత్త సేకరణ కోసం ట్రాక్టర్లు వీధుల్లో తిరిగి చెత్త సేకరించాలన్నారు. ఇంటిపన్నులు ఈ నెల 31 లోపు వందశాతం వసూళ్లు జరిపి, రశీదులను ఆన్‌లైన్ చేయాలని సూచించారు. సమావేశంలో పంచాయతీ కార్యదర్శులు,ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.



గోదాదేవి రంగనాయకుల కల్యాణం

ఇబ్రహీంపట్నం: మండలంలోని యామాపూర్‌లో వేంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో గోదాదేవి రంగనాయకుల కల్యాణం అర్చకులు మాదవచార్యులు, నవీన్‌చార్యులు ఘనంగా నిర్వహించారు.భక్తులు ప్రత్యేక పూజలు, మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు కాస దశరథ్ రెడ్డి, జేడీ విజయ్, మోర్తాడ్ అరుణ్, రెంధ్ల నారాయణ, రాజేశ్‌గౌడ్, మర్రిగడ్డ శ్రీనివాస్, గ్రామస్తులు పాల్గొన్నారు.



ధనుర్మాస పూజలు..

జగిత్యాలటౌన్: ధనుర్మాసోత్సవాల్లో భాగంగా పట్టణంలోని వేణుగోపాలస్వామి ఆలయం, అష్టలక్ష్మి ఆలయం, మార్కండేయ ఆలయం, ధరూర్ క్యాంపులోని శ్రీకోదండరామాలయానికి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై ప్రత్యేక పూజలు చేశారు. కోదండ రామాలయంలో బుధవారం మాతలు స్వామి వారికి మంగళ హారతి సమర్పించారు.



గుంతలు పూడ్చివేత

కథలాపూర్: మండలంలోని పోసానిపేట, తాండ్రియాల గ్రామాల మధ్య గుంతలమయంగా మారిన రోడ్డును బుధవారం మట్టితో పూడ్చివేయించారు. ఈ నెల 8న సాక్షి దినపత్రికలో రోడ్డుపై గుంతలు ప్రమాదాలకు నిలయం అని ఫొటో స్టోరీ ప్రచురితమైంది. పోలీస్ అధికారులతోపాటు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి తొట్ల అంజయ్య, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు యాగండ్ల రమేశ్ స్పందించి గుంతల్లో మట్టిని పోయించి చదును చేశారు. రెండు గ్రామాల ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు.

సాక్షి స్పందన

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9705346639, 9440061630, 9705346643

గుడ్డు భారం.. పోషకాహారం దూరం

- మధ్యాహ్న భోజన నిర్వాహకులకు ఆర్థిక ఇబ్బందులు
- కథలాపూర్ మండలంలో 4,200 మంది విద్యార్థులు



భూషణరావుపేట జెడ్పీ హైస్కూల్‌లో మధ్యాహ్న భోజనం వండుతున్న నిర్వాహకులు

కథలాపూర్: కోడిగుడ్డు ధర రోజురోజుకి పెరుగుతుండడంతో మధ్యాహ్న భోజన నిర్వాహకులకు ఆర్థిక భారంగా మారింది. వారానికి మూడు రోజులు తప్పనిసరిగా కోడిగుడ్డు అందించాలని అధికారులు పేర్కొంటున్నా.. ధరలు పెరగడంతో ఒకటి రెండు రోజులు ఇస్తుండటంతో విద్యార్థులకు పోషకాహారం దూరమవుతోంది.

మండలంలోని 45 ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, జెడ్పీ హైస్కూళ్ల పరిధిలో 4,200 మంది విద్యార్థులున్నారు. వీరికి మధ్యాహ్న భోజనం అందించేందుకు 56 మంది నిర్వాహకులు పనిచేస్తున్నారు. విద్యార్థులకు వారానికి 3 రోజులు, నెల మొత్తంలో12 సార్లు విద్యార్థులకు కోడిగుడ్డు అందించాలి. కానీ గుడ్డు ధర రూ.7 వరకు పెరగడంతో నిర్వాహకులకు తలకు మించిన భారమవుతోంది. ప్రభుత్వం కోడిగుడ్డుకు రూ. 5 మాత్రమే చెల్లిస్తుండటంతో రెండు రూపాయల అదనపు భారంతో పడుతోంది. మధ్యాహ్న భోజన కార్మికులకు ప్రభుత్వం సకాలంలో చెల్లించకపోవడంతో అప్పులు చేసినట్లు పలువురు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వమే నిత్యావసర సరుకులను చెల్లించాలని నిర్వాహకులు కోరుతున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం



ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు మంచి భోజనం అందించాలని నిర్వాహకులకు సూచించాం. కోడిగుడ్డు ధర పెరగడంతో మధ్యాహ్న భోజన నిర్వాహకులకు పడుతున్న భారం గురించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రతీ వారం మూడు కోడిగుడ్లు విద్యార్థులకు తప్పనిసరిగా ఇవ్వాలి.

– లోకిని శ్రీనివాస్, ఎంఈవో,కథలాపూర్

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

- ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్



చెక్కులు పంపిణీ చేస్తున్న లక్ష్మణ్ కుమార్

పెగడపల్లి: అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందిస్తామని ధర్మపురి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. పెగడపల్లి మండలంలో బుధవారం పర్యటించి వివిధ పథకాల లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. అంబేడ్కర్ చౌరస్తాలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం మాట్లాడుతూ ఆరు గ్యారంటీల అమలు కోసం రేవంత్ రెడ్డి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందన్నారు. ప్రతి పక్షాలు ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నాయని, ఇచ్చిన హామీ మేరకు పథకాలు అమలు చేసి తీరుతామని తెలిపారు. రైతులకు రుణమాఫీ, రైతు భరోసా, గల్ఫ్ కార్మికుల కుటుంబాలకు సంక్షేమ నిధి వంటి పథకాలతో ప్రజలకు అండగా ఉన్నామన్నారు. కాళేశ్వరం లింక్–2లో భాగంగా దీకొండలో రిజర్వాయర్ పూర్తయితే ముందుగా ఈ ప్రాంత రైతులకు సాగు నీరందించడం కోసం కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో నందగిరి విండో చైర్మన్ భాస్కర్‌రెడ్డి, తహసీల్దార్ రవీందర్, ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి, ఆర్ఐ శ్రీనివాస్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రాములుగౌడ్, రాష్ట్ర కాంగ్రెస్ మహిళా కార్యదర్శి శోభారాణి, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, మాజీ ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలల్లోనే నాణ్యమైన విద్య



మల్యాలలో ప్రచారం చేస్తున్న అధ్యాపకులు

జగిత్యాల: ప్రభుత్వ కళాశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని, ప్రతి ఒక్క విద్యార్థి అడ్మిషన్ పొందాలని ఎస్‌కేఎన్‌ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ అశోక్ అన్నారు. బుధవారం అడ్మిషన్ల కోసం మల్యాల జూనియర్ కళాశాలలో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎస్‌కేఎన్‌ఆర్ కళాశాల పురాతనమైనదని, ఇందులో అన్ని వసతులతో కూడిన ప్రయోగశాలలు, పోటీ పరీక్షల కోసం అతిపెద్ద గ్రంథాలయం, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఎన్నో ఉన్నాయని, గ్రామీణ విద్యార్థుల ఉజ్వల భవిష్యత్ కోసం ఈ ప్రచారం చేపడుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు శ్రీనివాస్, రాజు, మధుకర్, గోవర్ధన్ పాల్గొన్నారు.

విద్యార్థులు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేరండి.

ఇబ్రహీంపట్నం: ఇంటర్ పూర్తయిన విద్యార్థులు మెట్‌పల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేరాలని ప్రిన్సిపాల్ క్యాతం వెంకయ్య బుధవారం కోరారు. మెట్‌పల్లిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఏ, బీకాం కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. విద్యార్థులకు ఉచిత విద్య, ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. పూర్వ విద్యార్థులు మంచి ఉపాధి అవకాశాలు దక్కించుకున్నారన్నారు.

ఉద్యోగ అవకాశాలు

జగిత్యాల: జిల్లాలోని గ్రామీణ నిరుద్యోగ యువత కోసం ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని డీఆర్డీఏ పీడీ రఘువరన్ తెలిపారు. ఇంటర్, డిగ్రీ, టెన్త్, బీఫార్మసీ, ఎంఫార్మసీలో ఉత్తీర్ణులైన వారి కోసం ప్రైవేటు మెడ్‌ప్లస్ కంపెనీ హైదరాబాద్‌లో 70 ఖాళీలు ఉన్నాయని, ఆసక్తి గల వారు ఈనెల 10న తమ ధ్రువీకరణ పత్రాలతో జిల్లా సమైక్య కార్యాలయంలో జరిగే ఇంటర్వ్యూలకు హాజరు కావాలన్నారు. వివరాలకు 62812 92787 సంప్రదించాలని కోరారు.

సమస్యలు పరిష్కరించండి

జగిత్యాల: సమస్యలను పరిష్కరించాలని టీఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్‌కు జగిత్యాల టీఎన్జీవో నాయకులు హైదరాబాద్‌లో బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగులు క్షేత్రస్థాయిలో ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో జగిత్యాల జిల్లా అధ్యక్షుడు నాగేందర్‌రెడ్డి, నాన్ గెజిటెడ్ వెటర్నరీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కందుకూరి పూర్ణచందర్, ప్రధాన కార్యదర్శి ముజీబ్ పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగుల సంఘం డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ

జగిత్యాలఅగ్రికల్చర్: తెలంగాణ విద్యుత్ ఉద్యోగుల సంఘం డైరీ, క్యాలెండర్‌ను బుధవారం జిల్లా విద్యుత్ శాఖ కార్యాలయంలో ఎన్పీడీసీఎల్ ఎస్‌ఈ సాలీయ నాయక్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు రాంజీనాయక్, సంఘ నాయకులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

రాయికల్: అభిలాష హెల్పింగ్ హ్యాండ్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో సావిత్రీబాయి పూలే జయంతి సందర్భంగా జాతీయ ఐకాన్ అవార్డుల ప్రదానోత్సవానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ గంగధరి సురేశ్ తెలిపారు. సంఘ సంస్కర్తలు, సినిమా నటులు, విద్యావేత్తలు, ఉద్యమకారులు, కళాకారులు, జర్నలిస్టులు, న్యాయవాదులు వివిధ రంగాల్లో సేవలందిస్తున్న వారు ఈనెల 12లోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. 63029 08528 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

డ్రెయినేజీ నిర్మాణం యథావిధిగా చేపట్టాలి

రాయికల్: పట్టణంలోని 3వ వార్డులో డ్రెయినేజీ నిర్మాణం కోసం గతంలో తవ్విన విధంగా నిర్మాణం చేపట్టాలని కోరుతూ బుధవారం కాలనీవాసులు కమిషనర్ జగదీశ్వర్‌గౌడ్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొందరు రాజకీయ నాయకులు భయభ్రాంతులకు గురిచేస్తూ నిర్మాణం చేపడుతున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు రమేశ్, మల్లారెడ్డి, కవిత, గంగారెడ్డి, భాగ్య, లక్ష్మీ, మమత పాల్గొన్నారు.

డ్రెయినేజీ పనులు ప్రారంభం

ఇబ్రహీంపట్నం: మండలంలోని బర్దీపూర్‌లో ఎంపీ కోటాలో మంజూరైన నిధులతో డ్రెయినేజీ నిర్మాణ పనులను బుధవారం స్థానిక నాయకులు ప్రారంభించారు. రాజ్యసభ ఎంపీ సురేశ్‌రెడ్డి రూ. 5 లక్షలు మంజూరు చేశారన్నారు. కార్యక్రమంలో నాయకులు సంఘం సాగర్, దివాకర్, సాయికుమార్, కిషన్, గంగాధర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతపై విద్యార్థుల ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, పోలీసులు

జగిత్యాలటౌన్: జాతీయ రోడ్డు భద్రత వారోత్సవాల సందర్భంగా బుధవారం పట్టణంలోని న్యూఏస్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రమాదాల నివారణ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ప్లకార్డులతో యావర్ రోడ్డుతో పాటు ప్రధాన వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ రాజిరెడ్డి, రవాణా,ట్రాఫిక్‌అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు భద్రత అందరి బాధ్యత

పెగడపల్లి: రోడ్డు భద్రత అందరి బాధ్యతని మల్యాల సీఐ రవి, ఎస్సై రవికిరణ్ అన్నారు. పెగడపల్లి పోలీస్ స్టేషన్ ఆవరణలో బుధవారం రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా ఆటో డ్రైవర్లు, వాహన యాజమానులకు అవగాహన కల్పించారు. వాహనాలు నడిపేటప్పుడు తప్పనిసరిగా రోడ్డు భద్రత నియామలు పాటించాలన్నారు. రోడ్డు భద్రత, నియమాలు, జాగ్రత్తలు, ప్రమాదాల నివారణ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సిబ్బంది సంపత్, రమ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు భూషణరావుపేట విద్యార్థిని



శ్రీనిధి

కథలాపూర్: మండలంలోని భూషణరావుపేట జెడ్పీ హైస్కూల్‌కు చెందిన కూన శ్రీనిధి అనే పదో తరగతి విద్యార్థిని రాష్ట్ర స్థాయి ఖో ఖో పోటీలకు ఎంపికైనట్లు పీడీ నవీన్ బుధవారం తెలిపారు. కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ గురుకుల పాఠశాలలో జరిగిన శిక్షణ శిబిరంలో శ్రీనిధి ప్రతిభ చాటినట్లు ఉపాధ్యాయులు పేర్కొన్నారు. ఈ నెల 9 నుంచి వరంగల్ జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి ఖోఖో పోటీల్లో శ్రీనిధి పాల్గొంటుందని తెలిపారు.

ఏఈవో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా సంధ్య

జగిత్యాలఅగ్రికల్చర్: రాష్ట్ర గ్రాడ్యుయేట్ ఏఈవో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా గొల్లపల్లి మండలం వెనుగుమట్ల క్లస్టర్ ఏఈవో ఎ. సంధ్య ఎన్నికయ్యారు. రాష్ట్ర వ్యాప్తంగా ఏఈఓలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లాలో ఏఈఓల సంఘం సభ్యులు అభినందించారు.

గద్దర్ విగ్రహ కమిటీ నియోజకవర్గ అధ్యక్షుడిగా అంజయ్య

కోరుట్ల రూరల్: ప్రజా యుద్ధ నౌక గద్దర్ విగ్రహ ప్రతిష్ఠ కమిటీ కోరుట్ల నియోజకవర్గ అధ్యక్షుడిగా కల్లూర్ గ్రామానికి చెందిన వనతడుపుల అంజయ్య నియమిస్తూ గద్దర్ గళం ఫౌండేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, విగ్రహ ప్రతిష్ఠ కమిటీ చైర్మన్ గజ్జెల స్వామి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

ఆటో యూనియన్ అధ్యక్షుడిగా మురళి

మల్యాల: మండలంలోని ఆంజనేయస్వామి ఆటో యూనియన్ అధ్యక్షుడిగా మద్దినేని మురళిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆటో యూనియన్ సమావేశమై నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మురళి, ప్రధాన కార్యదర్శిగా ఎండీ.తాజ్, ఉపాధ్యక్షుడిగా ఎండీ.రఫీ, కోశాధికారిగా బందరవీందర్, సలహాదారులుగా అన్నెల నరేశ్, మహేశ్, జలంధర్, కార్యవర్గ సభ్యులుగా పోచమ్మల సంతోష్‌కుమార్, తదితరులను ఎన్నుకున్నారు.

వ్యాన్ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా సతీశ్‌కుమార్



ఎన్నికైన అసోసియేషన్ కమిటీ బాధ్యులు

పెగడపల్లి: వ్యాన్ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా అనుమండ్ల సతీశ్ కుమార్ ఎన్నికయ్యారు. పెగడపల్లి, గొల్లపల్లి, వెల్గటూర్, ఎండపల్లి మండలాల వ్యాన్ ఓనర్స్ అసోసియేషన్ ఎన్నికలు బుధవారం పెగడపల్లి మండల కేంద్రంలో జరిగాయి. ఉపాధ్యక్షుడిగా వెల్మ సత్యనారాయణరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా బండారి రవీందర్, గౌరవ అధ్యక్షులుగా కొంగల రాజనరేందర్‌రెడ్డి, సలహాదారులుగా తోడుటి తిరుపతి,ఎండీ షరీఫ్, కర్నాల కాశీరాం, కార్యదర్శిగా పాకల సుధాకర్, సంయుక్త కార్యదర్శిగా పోరండ్ల రాజేందర్‌లను ఎన్నుకున్నారు.

బీజేపీ దిష్టిబొమ్మ దహనం



దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

మెట్‌పల్లి: కాంగ్రెస్ నాయకులపై బీజేపీ నాయకులు దాడి చేశారని ఆరోపిస్తూ పట్టణంలోని పాత బస్టాండ్ వద్ద కాంగ్రెస్ నాయకులు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా బీజేపీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ప్రియాంకగాంధీపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బీజేపీ ఎంపీని వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి పెంట ప్రణయ్, నాయకులు అమ్ముల రాహుల్, భూమేశ్, జెట్టి లక్ష్మణ్, బీర్కుల విజయ్ తదితరులున్నారు.

మాజీ ఎంపీని బీజేపీ నుంచి సస్పెండ్ చేయాలి

ఇబ్రహీంపట్నం: కాంగ్రెస్ పార్టీ ఎంపీ ప్రియంకా గాంధీ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన బీజేపీ నాయకుడు రమేష్ బిదూరిని వెంటనే పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని యూత్ కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని ఇందిరాగాంధీ చౌరస్తా వద్ద బుధవారం దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ నియోజకవర్గం ఉపాధ్యక్షుడు కొడిమ్యాల దీపక్‌రాజ్, మండల అధ్యక్షుడు నల్లూరి సాగర్, సేవాదళ్ మండల అధ్యక్షుడు సొల్లు ముత్యంరెడ్డి, ఫిషర్‌మెన్ మండల అధ్యక్షుడు మగ్గిడి నందకిషోర్, పాల్గొన్నారు.

ఇసుక లారీ పట్టివేత

మెట్‌పల్లిరూరల్: మండలంలోని మారుతీనగర్ వద్ద అక్రమంగా ఇసుకను తరలిస్తున్న లారీని పట్టుకున్నట్లు సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మారుతీనగర్ వద్ద బుధవారం ఉదయం రెవెన్యూ, పోలీస్ సిబ్బంది తనిఖీలు చేస్తుండగా, అటు వైపు ఇసుక లారీ వచ్చింది. దానిని పరిశీలించగా ఎటువంటి అనుమతి పత్రాలు లేకపోవడంతో లారీని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. మేడిపల్లి మండలం నుంచి నిజామాబాద్‌కు ఈ ఇసుకను తరలిస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

ధర్మపురి: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై ఉదయ్‌కుమార్ సూచించారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు సీఐ రాంనరిసింహారెడ్డి ఆధ్వర్యంలో బుధవారం మగ్గిడి గురుకుల పాఠశాల విద్యార్థులకు సైబర్ నేరాలు, రోడ్డు సేఫ్టీలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ .. ఇంటర్‌నెట్, సెల్ ఫోన్లలో వస్తున్న మెస్సేజ్‌లతో చాలా మంది మోసపోతున్నారని అవసరం లేనటువంటి లింకులను ఓపెన్ చేయవద్దని సూచించారు. విద్యార్థులు తమ చదువులను చక్కగా చదువుకొని విద్యావంతులుగా ఎదగాలని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ సేవలు సద్వినియోగం చేసుకోవాలి



అక్షరాభ్యాసం చేయిస్తున్న సీడీపీవో

రాయికల్: గర్భిణులు, బాలింతలకు అంగన్‌వాడీలో అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని సీడీపీవో మమత అన్నారు. మండలంలోని ఇటిక్యాల అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం గర్భిణులకు సీమంతాలు, చిన్నారులకు అన్నప్రాసన చేశారు. ఈ సందర్భంగా సీడీపీవో మమత మాట్లాడుతూ, ప్రభుత్వం నుంచి మంజూరయ్యే పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని, అలాగే గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. 6 ఏళ్ల లోపు చిన్నారులను అంగన్‌వాడీల్లో చేర్పించాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌వో ప్రేమల, హెల్త్ సూపర్‌వైజర్ ఉమరాణి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మావతి, హెచ్‌ఎం జ్యోతిరాణి పాల్గొన్నారు.